# 6. "ఓ, ఎస్! " వసుదేవుడి కథ

వసుదేవన్ అని, మా ఆఫీసులో ఒకాయన 'ఓ.ఎస్'గా ఉండేవాడు - కిందటేడాది డిసెంబర్‌లో రిటైరయ్యాడు. అతని పేరుమీద అతని 'హోదా'లేక డిజిగ్నేషనుమీద జనం జోకులు పేలుస్తుండేవారు. అతనికి తల్లిదండ్రులు పెట్టిన పేరు వాసుదేవన్ అయివుండాలని , ఆ పేరుని అతని స్పెల్లింగ్ మార్చకుండా వసుదేవన్ అని మార్చుకున్నాడనీ అనడం అతని అధికారులకీ, అతని సెక్షన్‌లో పనిచేసే గుమాస్తాలకీ కూడా సరదా. వాసుదేవ - శబ్దం విష్ణు నామాల్లో ఒకటి కనక చరిత్రాత్మకమే, చరితార్థమే. అది కాస్తా వొదిలేసి "వసుదేవ అని పెట్టుకున్నారేమిటి సార్ మీ పేరు - అని ఎవరైనా అతను మంచి మూడ్లో ఉన్నప్పుడు అడిగితే వసుదేవుడు వాసుదేవుడికి తండ్రికదా, నాకు దేవుడుగా ఉండడం కన్నా దేవుడిబాబుగా ఉండడం యిష్టం. అందుకని-'' అని చెప్పేవాడు. అదేప్రశ్న అతనేదైనా కారణం వల్ల చిరాగ్గా ఉన్నప్పుడు అడిగితే 'ఏం చెయ్యను, తెల్లార్లేచి ఎందరో అడ్డగాడిదల కాళ్లు పుచ్చుకోందీ దినం వెళ్లడం లేదు. మరి గాడిద కాళ్ళు పట్టుకున్నవాడు వసుదేవుడే కదా అందుకని -' అని చెప్పేవాడు.

అలాగే; అతను సూపరింటెండెంట్‌గా ఉండేవాడు కదా, అంతకు ముందంతా ఆ ఉద్యోగంలో ఉండే వాళ్లని "సూపరింటెండెంట్" గారనే అనేవారు. అంత పొడుగ్గా చెప్పడానికి నోరు తిరగని వాళ్ళు 'సూపరెంటు' గారనీ, 'సూపరు' గారని అనేవాళ్లు. ఇతను ఆ పోస్టులోకి వచ్చాక ఎవరో 'సూపర్' గారు అనడం ఈయన చెవినపడి, "ఏంటయ్యా మీ ఉద్దేశం? సరిగా పలకలేరా నా డిజిగ్నేషను? సూపరేమిటి, సూపరూ పాపరూనూ? సూపరింటెండెంట్ అనండి, లేదా మీకు నోరు తిరక్కపోతే "ఓ.ఎస్!'' అనండి!'' అని డబాయించేడట. 'ఓ.ఎస్. అలాగేనండి' అన్నాడట; ఇతనితో పనుండి వచ్చిన ఆ వ్యక్తి. ఆ వొచ్చిన వ్యక్తి వెళ్లిపోయాక ఒక కొంటెగుమాస్తా "సార్, మీరేమంటే దానికి 'ఓ.ఎస్' అనడం మాకందరికి విధాయకమే అనుకోండి; కానీ మీరు మిమ్మల్ని 'ఓ,ఎస్!' అని పిలవమనడం బాగాలేదుసార్. ఎవరైనా వింటే మీస్వభావాన్ని వేళాకోళం చేస్తున్నామని అనుకుంటారు సార్'' అని నచ్చజెప్పబోయాడట. దానికి వసుదేవన్ గారు "నేను ఆఫీసర్ల మాటలకి ఓ.ఎస్! అంటున్నానని నన్ను ఆవిధంగా పిల్చి వేళాకోళం చెయ్యమంటున్నానని కదూ మీ ఉద్దేశం? అలా ఏం కాదు. ఓ.ఎస్; అంటే ఆఫీసు సూపరింటెండెంట్ అని అర్థం. సూపరింటనీ, సూపరెంటనీ, సూపర్ రెంటనీ, సూపరనీ, పాపరనీ, ఇంకా మీకు సరదాగా వుంటే స్పీపరనీ- మీకేంపోయింది; ఎలాపడితే అలాగే పలుకుతారు. కానీ నేనీ ఆఫీసుకి సూపరింటెండెంట్‌ని కనక అందరూ ఓ.ఎస్. అనడమే నాకిష్టం!'' అని జవాబు చెప్పి; "ఇకమీదట సూపరింటెండెంట్ అనే ఉద్యోగం ఓ.ఎస్. అనే పొడి అక్షరాలతోను, ఆఫీసు సూపరింటెండెంట్ అనే పూర్తి పేరుతోను వ్యవహరిల్లుగాక'' అని నోటు పెట్టి "ఓ.ఎస్'' అనిపించుకున్నాడు. దాంతో అతను ఓ.ఎస్ వసుదేవన్‌గా ప్రఖ్యాతి చెందేడు-

సదరు వసుదేవన్ తనకి పద్దెనిమిదో యేడు వెళ్ళీవెళ్లగానే అనగా 1946 డిశెంబర్ 27వ తేదీని బ్రిటీష్ ప్రభుత్వం వారి హయాంలో ఉద్యోగంలో చేరాడు. వెనకటికి ఒక జైలుపక్షిని వాళ్ల

జె.ఎస్ (అదేంటి, ఆమాత్రం తెలీదు? జె.ఎస్. అంటే జైలు సూపరింటెండెంట్!) అడిగాడట; "ఏమయ్యా. నువ్వు ఎప్పుడు పడితే అప్పుడు ఏదో ఒక నేరం చేసి జైల్లోకొచ్చి ఏళ్ళ తరబడి ఇక్కడ కూర్చుంటున్నావే; నీకు మీ వాళ్లని చూడాలనిపించదటయ్యా"- అని. దానికి ఆ జైలుపక్షి "ఎందుకనిపించదండీ? కాని నాకు చూడాలనిపించే మా బంధువులంతా ఇక్కడే వున్నారు కదండీ" అని జవాబిచ్చేడట-

అలాగ్గా వాసుదేవన్ 1946 డిశెంబర్ 27 నుంచి 1986 డిశెంబర్ 31 వరకూ శెలవు అంటూ పెట్టకుండానే నలభై ఏళ్ళ సర్వీసుని సునాయాసంగా గడిపేసి; ఎప్పుడైనా తనకో తనభార్యకో దగ్గర బంధువుల్ని చూడాలనిపించిపుడు: వాళ్ళనే ఇక్కడికి రమ్మనమని ఉత్తరాలు రాసేసేవాడు.

తమిళనాడులో ఉన్న వాళ్ల బంధువుల్లో ఎవరైనా వాళ్ల పిల్లల వివాహాలు తప్పనిసరిగా అక్కడే చెయ్యవలసి వచ్చినపుడు ఇతను వీలయినంత మట్టుకు భార్యని పంపి సరిపెట్టుకునే వాడు.అంతగా అతనే స్వయంగా వెళ్లితీరాలన్న పరిస్థితి వస్తే కేజువల్ లీవు పెట్టి వెళ్లొచ్చేసేవాడు. అలా; నలభై సంవత్సరాలు సుదీర్ఘ సర్వీసు ఎరన్డ్ లీవు అంటూ అసలెప్పుడూ పెట్టకుండా గడిపినందుకు వసుదేవన్ గారికి ప్రభుత్వం వారు ఒక యోగ్యతా పత్రం కూడా ప్రసాదించి 1986 ఆగస్టు 15వ తేదీన యావన్మంది సమక్షంలోనూ అందజేసారు. శెలవు రూల్స్‌లో కొన్ని ప్రగతిశీల నిర్ణయాలు రావడం వల్ల వసుదేవన్ గారికి రిటైరైన రోజున గ్రాట్యుయిటీ, పెన్షన్, కమ్యుటేషన్ (అమ్మకం)మొదలైనవి కాక శెలవు వాడుకోకుండా మిగుల్చుకున్నందుకు కూడా భారీ ఎత్తున పారితోషికం లభించింది.

అతను రిటైరైన రోజు సాయంకాలం ఆఫీసు వాళ్ళు ఒక చిన్న సభ పెట్టేరు. మెడలో పువ్వుల దండ వేసేరు - స్వీట్లు పొట్లాలతో ఇచ్చేరు - పళ్లు గుత్తులు గుత్తులుగా ఇచ్చేరు (ఉపన్యాసాలు కూడా ఇచ్చేరు. అది వేరే సంగతి.) ఆ ఉపన్యాసాలన్నిటిలో వసుదేవన్ గారు శెలవు పెట్టకుండా నలభై ఏళ్ళు పనిచెయ్యడమే కాక, 'అధికార్లకి ఓ.ఎస్.' అంటూ కింది గుమాస్తాలకి మార్గదర్శకుడుగా- సాటి వారికి ఆప్తమిత్రుడుగా, వ్యవహరించి; మరపురాని మనిషిగా మిగిలి పోయాడన్నారు. అతను లేకుండా రేపట్నించీ ఈ ఆఫీసు ఎలా నడుస్తుందా అని భయంగా ఉందన్నారు. వారిని చూసి ఈ తరం యువకులు నేర్చుకోవలసింది చాలా ఉంది. వసుదేవన్ గారు తన పిల్లల వివాహాల సందర్భంగా కూడా శెలవు పెట్టకుండా పనిచేసేరు. మొన్నీ మధ్య మీలో ఒకరు మాచ్ చూడ్డానికి వెళ్తున్నానంటే పోనీకదా అని నేను శెలవు గ్రాంటు చేసేను. తీరా అతగాడు చూసింది పెళ్లి సంబంధం కాదని క్రికెట్ మాచ్ అని తెలిసి నేనెంతో బాధపడ్డాను. అలాంటి దొంగ శెలవులే కాకుండా, నిజమైన అవసరానికి మనం అందరం వాడే శెలవు కూడా తీసుకోకుండా ఈ నలభై ఏళ్ళపాటు కష్టపడి పనిచేసినందుకు ఇహ మీదట ఆయన పూర్తిగా రెస్టు తీసుకోవాలని నేను ఆకాంక్షిస్తున్నాను." అని తన ఉపన్యాసం ముగించిన చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ గారు వసుదేవన్ గారికి ఒక ఈజీ చైరు, ఒక చేతి కర్ర, గీతా మకరందం లాంటి భారీ గ్రంథం ఒకటి: తన చేతుల మీదుగా అందజేసారు.

'సాయంకాలం ఇంటికి రావడానికి ఆలస్యమవుతుంది- అని ముందుగానే చెప్పారు.

గాని, ఇంత లేటయిందేమిటి?, అని వసుదేవన్ ఇంటికి వెళ్ళగానే వాళ్ళావిడ అడిగింది.

'టీ పార్టీ, ఫోటో, స్పీచిగళు ఎల్లాం సేరింది లేటాచ్చి' అని అతను చెప్పిన సమాధానం ఆవిడని సమాధాన పరచలేదు.

"అయినా మరీ యింత లేటా?"

"మరి వాళ్ళిచ్చిన వన్నీ అమ్ముకుని రావడానికి కొంత ఆలస్యం అయింది!"

"వాళ్ళేమిటిచ్చారు? అవన్నీ మీరు అమ్మేయడమేమిటి!" అందావిడ.

"లేకపోతే ఏమిటి, వాళ్ళ ఉద్దేశం? రిటైరయిపోగానే ఓ మూలని క్రిష్ణారామా అంటూ కూర్చోమని కాబోలు! ఈజీ చైరు, చేతి కఱ్ర, భగవద్గీత!!" అని చిందులు తొక్కేడు వసుదేవన్.

"అయ్యో, అయ్యో! అన్నీ అమ్మేశారుటండీ?"

"అమ్ముతానా అమ్మి పారేస్తానా? నా కింకా ముసలితనం రాలేదని వాళ్ళకి తెలియక పోతే నీకు తెలియదా?" అని వసుదేవన్ ఆవిడ దగ్గరసా వెళ్లి తన శక్తిని ప్రదర్శించబోయేటంతలో ఆవిడ వొళ్లు దాచుకుని స్వీట్లూ అవీ పెట్టిన సంచిలోంచి ఒక కవరు లాగి "ఇదేమిటండోయ్" అంది.

"అదా? సంబంధం అండ్ కో అని, మన వాళ్ళే. ఇక్కడ ఏదో వ్యాపారం చేస్తున్నారు. నేను సర్వీసులో ఉండగానే వాళ్ళతో సంబంధం పెట్టుకున్నాను కదా. రేపట్నించి వాళ్ల కంపెనీకి వచ్చి ఎకౌంటెంటుగా పనిచెయ్యమని ఆర్డర్". ★

# 7. బాకీ

వెనకటికి ఒక జోక్ -

సూర్యారావు దగ్గిర సుబ్బారావు వంద రూపాయలు అప్పు తీసుకున్నాడు. "మళ్లీ ఎప్పుడిస్తావు?" అని సూర్యారావు అడిగేడు. "మద్రాసు వెళ్తున్నాను. రాగానే ఇచ్చేస్తాను-" అన్నాడు సుబ్బారావు.

రెండు నెలలయింది. సుబ్బారావు కనిపించడం లేదేమా అని విచారించి సూర్యారావు అతని ఆఫీసుకి వెళ్ళి అతన్ని కలుసుకున్నాడు. "ఏమయ్యా వంద రూపాయలు అప్పు పట్టుకెళ్ళావు! మద్రాసు నుంచి రాగానే ఇచ్చేస్తానన్నావు. ఇదేనా, మర్యాద?" అని అడిగాడు.

"అవును, నేనింకా మద్రాసు వెళ్లలేదుగా. వెళ్లిరాగానే ఇచ్చేస్తాను, నిజం" అన్నాడు సుబ్బారావు.

నా పని అలాగయింది నారాయణ మూర్తితో. అప్పుడెప్పుడో వాళ్లావిడికి సీరియస్‌గా వుందని అర్జంటుగా ఆపరేషననీ చెప్పి అయిదు వందలు తీసుకున్నాడు. ఏడాది దాటింది. ఎప్పుడడిగినా ఖర్చులు, జీతంలో కటింగులు అంటాడే గాని తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చే ప్రసక్తి తేడు. చివరికి విసిగి, వాళ్ల ఎకౌంట్స్ ఆఫీసర్ అయిన రావుగారితో చెప్పుకున్నాను. నారాయణమూర్తికి జీతంకాక ఏవిధమైన అరియర్సో, రుణమో అయిదువందలకి మించి గానీ